# క్షమాభిక్ష

రెణ్ణాళ్లనుంచి ముసురుపట్టింది. ఆకాశంలో ఎక్కడ చూసినా నల్లమబ్బులు! అంతదాకా వర్షం కురసి అప్పుడే ఆగిపోయింది. మళ్ళీ ఏ క్షణానయినా తిరిగి వర్షం మొదలుకావచ్చు. ఈదురుగాలి విపరీతంగా వీస్తూవుంది. చెట్లమీది నీటి బొట్టులు ఒక్కొక్కటీ పడుతున్నాయి. ఆకాశం జార్చిన కన్నీటి బొట్టు ఘనీభవించినట్లుంది రైల్వే హాస్పిటల్.

రెండు ప్రక్కలా ఉన్న హాస్పిటల్ గదులు మధ్యగా ఉన్న వరండా చివర ఎక్స్‌పేండెడ్ మెటల్ కన్నాలలోంచి చొచ్చుకొని రాక్షసుడు విసిరిన సూదుల గుంపువంటి చలిగాలి వచ్చి, ఎటుపోవటానికి తోవలేక తిన్నగా సాగి, ఒక గది ముందు బెంచీపైన కూర్చున్న చెంచయ్య శరీరాన్ని పొడిచి పొడిచి హింసిస్తూవుంది.

రెండు కాళ్లూ బెంచీ పైన పెట్టుకొని, కాళ్ళమధ్య తలచేర్చుకొని, చేతులు కాళ్ళ చుట్టూ చుట్టుకొని వణుకుతున్న శరీరాన్ని తన అదుపులో వుంచుకోలేక, అదుపులో ఉన్న కళ్ళను పెద్దవి చేసికొని, తదేక దీక్షగా ఆత్రంగా వాకిలివైపు చూస్తున్నాడు చెంచయ్య. వేసిన తలుపు వేసినట్లే వుంది.

ఔట్ పేషెంట్స్ అంతా వెళిపోయారు. వరండాలు చాలావరకు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఎవరో ఒకరిద్దరు అప్పుడప్పుడూ అటూ ఇటూ పోవటంతప్ప, రద్దీలేదు. కాజువాలిటీ డాక్టరు రోగులు లేక, రాక, పనిలేక కిటికీలోంచి, యూకలిప్టస్ చెట్లు ఆకుల్లోంచి, మేఘాలలోంచి, ఆకాశం అంచుల్లోకి చూస్తూ నిలబడ్డాడు.

చెంచయ్య వయస్సు డెబ్బై. వృద్ధాప్యపు పునాదులు స్థిరపడి, కట్టడాలు

లేచాయి ముఖంమీద. తలపండి పోయింది. శరీరంలో ఎముకలు తప్ప మాంసం లేదు. వణుకు తప్ప, అతని శరీరంలో ఏ కదలికా లేదు. ఎదుటి గదిలోకి చూస్తున్న కళ్లుమాత్రం రెండు దివిటీలు. రెండు ఎక్స్‌రేలు.

కాజువాలిటీ డాక్టరు ఆకాశంలోంచి రూంలోకి చూపులు మళ్ళించి అటూ ఇటూ తిరిగి, వెలుపలికి వచ్చి యధాలాపంగా చెంచయ్యను చూశాడు. లేదు. చూడలేదు. చూసీ చూడనట్లే! చూడకపోయినా చూచినట్లే! కంట్లో పడిన బొమ్మను మనిషి అనుకోలేదు. అంతే!

చెంచయ్య దగ్గాడు.

డాక్టరు వెనుదిరిగి చూశాడు.

'ఎవరు మీరు?'

చెంచయ్య చూశాడు. చూసిందానికి గుర్తు తలా కళ్లూ కదిలాయి. నవ్వినట్లే లెక్క! ఎందుకంటే సెలవులు విచ్చుకొని బోసినోరు కనిపించింది.

"ఏం జబ్బు?"

ఏమీ లేదన్నట్లు తల వూపాడు.

"లోపలికి వస్తారా?"

రానన్నట్లు తల తిప్పాడు.

'చలిగా లేదూ?' ఉలెన్ కోటు సరిచేసుకొంటూ అడిగాడు.

నూలు చొక్కా లోపల వణుకుతున్న శరీరం దాచుకొంటూ లేదన్నట్లు తల ఆడించాడు.

'జబ్బు లేదు. లోపలికి రాడు. చలి లేదు' అనుకొంటూ లోపలికి పోయి, కిటికీలోంచి ఆకాశంలోకి చూస్తూ నిలబడ్డాడు కాజువాలిటీ డాక్టరు.

సూదుల గుంపుకు పదును పెట్టి విసిరినట్లుగా ఈదురుగాలి. ప్రేగులు వణుకుతున్నాయి, వళ్ళంతా కొరుక్కు తింటున్నట్లుంది చలిగాలి. అప్పుడు ఎదుటి గది తలుపు లోపల్నుంచి తెరచుకొంది. యువకులు ఎనిమిదిమంది వెలుపలికి వచ్చారు. సదాశివం దగ్గరకు వచ్చి 'ఎక్స్‌రే స్క్రీనింగ్, ఫరవా లేద'ని చెప్పి ప్రక్కనే కూర్చున్నాడు.

స్క్రీనింగ్ రూంలోంచి డాక్టరు రఘురాం వెలుపలికి వచ్చాడు. చెంచయ్యను చూసి, చేతులు అసంకల్పితంగా పైకిలేచాయి. ముఖం మీదికి రాలేదు. జోడింపబడలేదు. గుండె మీదికి వచ్చి, గుండె చప్పుడు విని, గుండెతో మాట్లాడి, క్రిందికి వాలిపోయాయి. ముఖం ఈషణ్మాత్రంగా చలించి బిగిసిపోయింది. ఏమో అనబోయి అల్పంగా తెరచుకొన్న నోరు, మళ్ళీ మూతబడక అలాగే వుండిపోయింది. ముందుకు రాబోయి పడిన కాలు అలాగే ఆగిపోయింది.

చెంచయ్య డాక్టరును చూశాడు. కళ్లు పెద్దవి చేసుకొని చూశాడు. కళ్లు కుంచించుకొని చూశాడు. శిఖరం మీదివాడు లోయలోవాణ్ణి చూసినట్లు చూశాడు. లోయలోవాడు శిఖరం మీదివాణ్ణి చూసినట్లు చూశాడు. ముందడుగు వేయబోయి ఆగిపోయాడు. నోరు తెరువలేదు. చేయి కదపలేదు. మూగై, చెవిటై గుడ్డై గడ్డకట్టిపోయాడు చెంచయ్య.

సదాశివం వాళ్ళిద్దరిని చూసి బిత్తరపోయి, తండ్రిని అడిగాడు: 'డాక్టరుగారు తెలుసా నాన్న?' 'ఊ! రఘురాం అనుకొంటాను' అన్నాడు. ఏమో చెప్పబోయి తలవూపి క్రుంగిపోయి, దిగాలుపడి బెంచీమీద కూర్చు న్నాడు.

డాక్టర్ రఘురాం, కాంపౌండరు ఇచ్చిన కాఫీ ఏ లోకంలోనో ఉన్న మనిషిలాగా తాగాడు. సిగరెట్టు టిన్ను ఇస్తుంటే 'వద్దు! వద్దు!' అంటూ దూరంగా నెట్టాడు. ముఖం వణికింది. 'ఏం సార్?' అంటే, 'ఏమిటి!' అంటూ ఈ లోకంలోకి వచ్చిన డాక్టరు సిగరెట్టు తీసుకొని, ముట్టించబోతూ, తలుపువైపు చూసి వెళ్ళి తలుపులేసివచ్చి కూర్చుని సిగరెట్టు కాల్చుకొన్నాడు.

కాజువాలిటి ముందాగిన టాక్సీలోంచి దించి స్ట్రెచర్‌మీద ముసలాయన్ను కొడుకు లిద్దరు తీసుకువచ్చారు. బాత్‌రూంలో పడ్డాడట. కాలు బెణికింది. ఆ ముసలాయన కొడుకులిద్దరినీ చూస్తున్న చెంచయ్య లోతుకళ్ళలో, ఎండకాలం ఎండిపోయిన బావిలో ఎక్కడో చెమ్మ అయి, వూటపడ్డట్లుగా అయింది. 'అదృష్టవంతుడు' గొణుక్కున్నాడు.

ఐ టెస్ట్ ప్రారంభమయింది. రైల్వేహాస్పిటల్‌లో డాక్టరు రఘురాం ఒక్కొక్కరినీ పరీక్షించి పంపుతున్నాడు. వాళ్ళంతా రైలింజన్ డ్రైవర్ ఉద్యోగాలకు అప్లికేషన్‌లు పెట్టుకొన్నవాళ్ళు. అంతవరకు అన్ని పరీక్షలు అయిపోయాయి. మెడికల్ ఎగ్జామినేషన్‌లో ప్రధానభాగం కంటిపరీక్ష. అందులో మొదటిభాగం.

'ఏం టెస్ట్?'

'ఎలా వుంది?'

'లైట్ సరిగావుందా?'

'డాక్టర్ ఎలా వున్నాడు?'

టెస్ట్ అయిన వాళ్లను కానివాళ్ళు అడిగే ప్రశ్నలు వింత వింతగా వున్నాయి.

సదాశివం గదిలో ప్రవేశించి రఘురాం ముఖంలోకి చూశాడు. డాక్టరు ముఖం పూర్వం ఉన్నట్టులేదు మునుపు కోపంగా వుంటే ఇప్పుడు నెమ్మదిగా వుంది. ఇంతకుముందు ఆదరంగా వుంటే, ఇప్పుడు చిరాకుగావుంది.

'పేరు?'

చెప్పాడు.

'ఊరు?'

చెప్పాడు.

'తండ్రిపేరు?'

చెప్పాడు.

డాక్టరు గొంతు మారుతూ వుంది. పూర్వంలా లేదు. మునుపు కఠినంగా వుంటే ఇప్పుడు దయగా వుంది. ముందు దయగా వుంటే ఇప్పుడు కఠినంగా వుంది.

ఈ నాలుగునెలల్లో డాక్టరు స్వభావం తనకు బాగా తెలుసుననుకొన్న కాంపౌండరుకు ఆ ధైర్యం సడలిపోసాగింది. అర్థం కాలేదనిపించింది.

'చదువు!'

ఎదుట గోడమీదవున్న చార్టులో అక్షరాలు చదువుతున్నాడు సదాశివం. చివరి మూడువరుసలు మసకమసకగా అలుక్కుపోయినట్లు ఉన్నాయి. కనిపించటం లేదు.

'చదువు!'

చదవటం లేదు. నోరు కదపటం లేదు. కళ్ళు కదిపాడు. చెమ్మగిల్లాయి.

'చదువు!'

డాక్టరు గొంతు మునుపున్నట్లు లేదు. వింతగా వుంది.

'కనిపించినంతవరకు చదువు!'

డాక్టరు గుండెలో ఏదో పొరలో మెలికబడి దాక్కునివున్న అల్ప దీప్తితో, మెడులా అబ్లాంగేటాలో ముడిపడివున్న ఏదో అనుభూతి వెలుగుతూ ఆరిపోతూ స్పష్టంగా కనిపించక, పూర్తిగా కనిపించకుండా పోక అస్పష్టంగా అవ్యక్తంగా వుంది.

'చదువు!'

"చదవలేను"

డాక్టరు సదాశివం ముఖంలోకి నిస్సహాయంగా చూసి, మూడు అట్టలు ముందుంచాడు. రెండు పెద్దలిపి వున్న అట్టలు చదివాడు. మూడవది మిగిలి వుంది.

"చదువు!"

"చదవలేను"

సదాశివం వెలుపలికి రాగానే "ఎలావుంది?" తండ్రి అడిగాడు. "ఏం వుంది-మామూలే-నా కళ్లు-మనవనుకున్నట్లే-సరింగా చదవలా". "ఏం భయం లేదు కూర్చో" తండ్రి మందలించాడు.

చెంచయ్య చొక్కా జేబు తడుంకొన్నాడు. నోట్లకట్ట భద్రంగా వుంది. డబ్బు చేతితో తాకుతున్నప్పుడు చెంచయ్య నూరేళ్ళు నిండినవాడై పోయాడు. నరాలు బిగుసుకు పోతున్నాయి.

చెంచయ్యకు లేకలేక కలిగిన ఏకైక సంతానం సదాశివం. మొదట్లో అంతా చెంచయ్యకు పిల్లలు కలగరనే అనుకొన్నారు. నలభై అయిదో ఏట కొడుకు పుట్టగానే భార్య గతించింది. నాకు తోడు ఇద్దరుండే జాతకం కాదు కాబోలునని సర్దుకొన్నాడు.

సదాశివానికి తల్లీ తండ్రీ తనే అయి పెంచాడు. తన దురదృష్టమో గారాబమో తెలియదు కానీ, కొడుక్కు చదువు అబ్బలేదు. స్కూలుఫైనల్ చివరి ఛాన్సు ముగించి ఊరుకొన్నాడు.

చదువు రాలేదు కానీ వయస్సు వచ్చింది. వచ్చిన వయస్సు ముఖానికి వన్నె తెచ్చింది. అంతటితో ఆగలేదు. ఆగడాలు ప్రారంభించింది. అవక తవకలు చేసింది. అందుకు విరుగుడుగా కొడుకును వొక యింటివాణ్ణి చేశాడు.

అంతవరకు సాఫీగాపోతున్నబండి గతుకుల్లో పడింది. డబ్బు ఇబ్బంది ఎక్కువయింది. తనకు పూజలుచేసినా పిల్లలు కలగలేదు కాని, సదాశివం వద్దనుకొంటున్నా ఏడాదికొక కానుపు చొప్పున నాలుగేళ్ళలో కుటుంబం బాగా పెరిగిపోయింది.

తనకు కలిగినకాలంలో చేసిన ఖర్చు తల్చుకొంటే బాధగానే వుండ వచ్చుకానీ, వృథామాత్రం కాలేదన్న నమ్మకం అతన్ని బ్రతకనిస్తుంది.

తల్లిదండ్రులు తనకు ఇచ్చిపోయిన ఆస్తి ఏమీలేదు. అయితే తను చదువుకొన్నాడు. ఉద్యోగం చేసుకొన్నాడు. కాని సదాశివం చదువుకోలేదు. ఆస్తిలేదు, ఉద్యోగంలేదు. ఎలా బ్రతుకుతాడు? పిల్లల్ని ఎలా పోషిస్తాడు?

తొత్రిదో మొత్రిదో ఒక ఉద్యోగమంటూ వుంటే బ్రతుకు తెల్లవారి పోతుంది. అందుకోసం సదాశివం ఎంతో ప్రయత్నించాడు. ఎటుపోయినా చుక్కెదురయింది.

కొడుక్కోసం తను కూడా ప్రయత్నించాడు. ఏ ప్రయత్నమూ న్యాయమార్గంలో ధర్మయుతంగా కలసిరాలేదు. దాంతో తను బాగా విసిగి పోయాడు. వీడికి ఉద్యోగదశ లేదని నిరుత్సాహపడ్డాడు. 'నాకిహింకే ఉద్యోగంలే' అని ప్రయత్నాలే మానుకొన్నాడు సదాశివం.

ఆ మధ్య రైల్వేలో డ్రైవరు ఉద్యోగాలు కాళీలు ప్రకటించారు. జీతంకూడా బాగుంది. సదాశివం దరఖాస్తుపెట్టుకొన్నాడు. పరీక్ష వ్రాశాడు. ఇంటర్వ్యూకి వెళ్ళాడు. సెలెక్ట్ అయ్యాడు. ఆ వార్త విన్నరోజు తను పొందిన ఆనందం ఎంతని చెప్పటానికీ వీల్లేదు.

మెడికల్ ఎగ్జామినేషన్ వుంటుందని, అందులో అన్‌ఫిట్ అయితే ఉద్యోగం రాదని, ఫిట్ అయితే ట్రయినింగ్‌కు పిలుస్తారని, మెడికల్ ఎగ్జామినేషన్ చాలా కష్టంగా వుంటుందని, తెలిసి గుండెల్లో రాయిపడ్డట్లు తాను బాధపడ్డాడు.

రైల్వే హాస్పటల్‌లో కాజువాలిటీముందు వరండాలో బెంచీ మీద

కూర్చున్న చెంచయ్య ముసలి నరాలుతో పరాచికాలు ఆడుతున్న చలిగాలిని పారద్రోలటానికి మరీ మునగరదీసుకు కూర్చుంటే. ఇంకా చొరబడి నరాలు కసాబసా నలుముతున్న చలిగాలిని ఏమీ చేయలేక, ఏడవలేక ఒదిగిఒదిగి దాక్కుంటుంటే, బైటవర్షం హోరు ఎక్కువయింది.

డాక్టరు చేతులు కడుక్కొని, నీళ్ళుతాగి, ఈజీ చైర్‌లో చేరగిలబడి, సిగరెట్టు కాల్చుకొంటూ కాంపౌండరును పిలిచి చెప్పాడు 'డ్రైవరుకు చెప్పు! వరండాలో ముసలాయనున్నాడు చూడు—ఆయన్ని కారులో ఇంటికి తీసుకు పోయి, నా గదిలో దించమని చెప్పు! ఏం కావలసినా చూడమన్నానని ఇంట్లో చెప్పి రమ్మను! పో!'

కాంపౌండరు డ్రైవరుతో సంగతంతా చెప్పాడు. ఇద్దరూ చెంచయ్యతో సంగతిచెప్పి బయిలుదేరమన్నారు. చెంచయ్య రెండు క్షణాలు ఆలోచించి 'అక్కర్లేదు. ఇక్కడే వుంటాను' అన్నాడు. కదల్లేదు. బిగిసిపోయాడు. బ్రతిమాలారు. మరీ శవంలాగా బిగిసి పోయాడు.

సిగరెట్టు పూర్తయి, ఏష్‌ట్రేలో వేస్తున్నప్పుడు కాంపౌండరు వచ్చి, జరిగిం సంగతంతా చెబితే, డాక్టరు వణికిపోయాడు. పెద్ద గాలిదుమారం రేగితే అల్లాడిపోయే మల్లెతీగలాగ వణికిపోయాడు. తనను తాను సంబాళించుకోలేక టేబుల్ మీద తల పెట్టుకొని కూర్చున్నాడు.

చెంచయ్య సెకండరీ గ్రేడు టీచరు. తనకు మాష్టరు. నిప్పులాంటి మనిషి. తన జీవితంలో ఎప్పుడూ ఎవరినీ ఏమీ యాచించలేదు. ఏదీ ఆశించలేదు. తనకోసం ఏమీ కోరుకోలేదు. అడిగిన వాళ్ళకు, తన దగ్గరుంటే, లేదనలేదు. హెడ్మాష్టరు అయినా, ఇన్స్పెక్టరు అయినా, డీయీవో అయినా అతని నిజాయితీ ఎదుట తలఎత్తే వాళ్లుకారు. అతనికి హాని చేయటానికి ఎవరికీ చేతులాడేవి కావు. దమ్ములేవు.

ట్యూషన్లుచెప్పి అందరూ అంతో ఇంతో సంపాదిస్తుంటే అడిగిన వాళ్ళకు పాఠాలుచెప్పి పైసా అయినా తీసుకోలేదు. పంటకాలం పండిం దాట్లోంచి ఎవరైనా ఏమయినా ఇవ్వబోయినా ఏమీ ముట్టుకొనేవాడుకాదు.

తన జీవితంలో ఒక్కరోజుకూడా స్కూలుకు సెలవు పెట్టలేదు. రిటైరు అయినరోజు చాలామంది చెంచయ్య సేవను పొగిడారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరూ సహాయం చేయలేదు. చెంచయ్య ఈ కాలంలో ఉండవలసిన మనిషి కాడు. గతకాలపు అవశేషం. ఒకానొక ధర్మకాలమనే పాలపాత్రలోంచి చిందిపడ్డ క్షీరబిందువు చెంచయ్య! ఒకానొక ధర్మయుగంలోని అంతిమ ఆధ్యాత్మిక రేఖ చెంచయ్య!! ఈ లోకంలోని పిచ్చివాళ్ళు కనే బంగారు కలలకు రూపచిత్రణం చెంచయ్య.

చెంచయ్య ఎదుట గదిలో నంబరు టెస్ట్ జరుగుతూ వుంది. ఒక పేజీలో ఉన్న రంగురంగుల చుక్కల్లో ఒక రంగు చుక్కలన్నీ కలిపిచూస్తే ఏదో ఒక నంబరు కనిపిస్తుంది. సదాశివం చూస్తున్నాడు. పేజీ తెరిచివుంది.

డాక్టరు అడిగాడు.

'నంబరు ఎంత?'

'ఇరవై!'

'ఏమిటో'

'ఇరవై'

డాక్టరు మరో పేజీ తిప్పాడు.

'చూడు! ఎంత?'

'డెబ్బైరెండు!'

ఎంత?

'డెబ్బైరెండు!'

'చెంచయ్యగారి అబ్బాయివి కదూ?'

డాక్టరు గొంతు కొండమీది నుంచి పడే సెలయేరు ధ్వనిలాగావుంది. దేగ తరుంతుంటే అరిచే పావురం అరుపులాగావుంది. టీచర్ కొడుతుంటే ఏడ్చే పిల్లవాడి గొంతులాగావుంది.

'అవును!'

'నీ కసలు అంకెలు కనిపిస్తున్నాయా?'

'లేదండీ!'

సదాశివం విచారంగా వెలుపలికి వచ్చాడు.

నంబరు టెష్ట్ పూర్తిచేసి, తన గదికి పోతూ చలిలో వణుకుతూ, బాధగా దగ్గుతూవున్న చెంచయ్యను చూచి తల వంచుకున్నాడు డాక్టరు.

మధ్యాహ్నం రెండయింది. ముసురు తగ్గలేదు. గాలికి కిటికీ తలుపులు తపతప కొట్టుకొంటున్నాయి. చలిగాలి విసిరికొడుతూ వుంది. ఎక్కడ చూసినా మేఘాలు. వుండి వుండి జల్లులు. కోటువేసుకొన్నా చలిగావుంది. ప్రేగులు లుమ్మలు చుట్టుకుపోతున్నట్లుంది చలి. చెంచయ్య కళ్ళలో మెదులుతున్నాడు. నూలుచొక్కా, పల్చటి చొక్కా, చలికి తట్టుకోలేని చొక్కా, పాతచొక్కా, శరీరాన్ని చలి ముట్టడినుంచి కాపాడలేక పోతూ వుంది. డాక్టరు రఘురాం వెంటనే లేచి, కోటుతీసి కాంపౌండర్‌కిచ్చి చెంచయ్యగారికి కప్పిరా పో!' అని పంపించాడు. కాంపౌండరు బెదురుతూ వెళ్ళాడు.

చెంచయ్య బెంచీమీద కూర్చునే వున్నాడు. గోడకు వీపూ తలా తగిలే టట్లు నిటారుగా కూర్చున్నాడు. కాళ్ళు నేలమీద వున్నాయి. చెప్పులయినా లేవు. చేయి గోడకు తగిలినా కాలు నేలకు తగిలినా నరాలు పీక్కు పోయేంత చల్లగా వున్నాయి. బక్కప్రాణి వృద్ధప్రాణి నిర్లక్ష్యంగా బెంచీ పైన కూర్చుని వుంది. దూరంగా ఎక్స్‌పేండెడ్ మెటల్‌లోంచి నేర్పరి అయిన విలుకాడు వదిలితే దూసుకువచ్చే బాణాలులాంటి చలిగాలి, ఎముకల వోపిక పరీక్షించే చల్లని చలిగాలి దూసుకు వస్తూ వుంది.

'ఈ కోటు వేసుకోండి!'

'ఎవరిది?'

'డాక్టరుగారిది!'

చెంచయ్య కాంపౌండరు ముఖంలోకి చెట్టునపూసిన పూవు రాలిపడు తున్నట్లు చూసి, తల దించుకొన్నాడు.

'అక్కర్లేదు. నాకు చలిలేదు'

'కాదు—చలిగా వుంది—వేసుకోండి'

మాట్లాడ లేదు.

'ఏమండి?'

కొంచెం సేపు నిలబడి, ఇక నిలబడలేక వెళ్ళిపోయాడు కాంపౌండరు.

చెంచయ్యకు ఉన్నట్టుండి దగ్గు వచ్చింది. విపరీతంగా దగ్గు! వళ్లంతా చల్లగా అయిపోతూ వుంది. భరించరాని చలి!

కాంపౌండరు కోటుతీసుకుని వస్తుంటే డాక్టరు రఘురాం చూస్తూ వున్నాడు. 'అంతా చూశాను' ప్రక్కకు నడిచాడు. 'సర్!' తల వూపాడు. 'కోటు కుర్చీకి వేయి' తప్పుకొన్నాడు.

ఈ నాలుగు నెలల్లో కాంపౌండరు చాలా గ్రహించాడు. రఘురాం అంత మంచి డాక్టరును తన సర్వీసులో ఇంతవరకూ చూళ్ళేదు. జీతం తప్ప పైసా అయినా ముట్టని ఈ డాక్టరు మొదట్లో వింత జంతువుగా, ఆ తర్వాత మండే నిప్పుగా అనిపించాడు. అంతా బాగానే వుంది కాని, ఏమీ పట్టు విడుపులు లేని మనిషి. తను మంచి అనుకొంటే ఎవరేం చెప్పినా వినడు. తను చెడ్డ అనుకొంటేమాత్రం ఎవరయినా ఏమయినా చెబితే వింటాడు. సిక్ చేయటానికి వచ్చిన ఏ రైల్వే ఉద్యోగి అయినా, ఎన్ని కష్టాలు చెప్పుకొన్నా,

నిజంగా సిక్ కాకపోతే, ఈ డాక్టరు దగ్గర్నుంచి సిక్ సర్టిఫికేట్ పొందలేడు. మొన్నటికి మొన్న ఏయస్ఎం కాండిడేట్‌లు వస్తే పదికి ముగ్గురు అన్‌ఫిట్. అలా మునుపు ఎప్పుడయినా జరిగిందేమో అంటే అనుమానమే! ఇంతగా రూల్ ప్రకారం పోయే మనిషిని తనింతకుముందు చూళ్లేదు.

దయా దాక్షిణ్యాలు పుష్కలంగా ఉన్న మనిషి! జాలీ సానుభూతి ఉన్న వ్యక్తి! రూల్ ఏ పరిస్థితుల్లోనూ తప్పని స్వభావం. లంచం ముట్టడమే కాదు, చూడటం వినటం కూడా ఇష్టంలేని తరహా!

ఏ కొంచెం కష్టం ఎవరికి కలిగినా సహించలేడు కానీ సంచలించిపోడు. తనలో కలిగిన ఏ భావమూ అంత త్వరగా బైటపెట్టే మనిషికాడు. ఇవాళ మాత్రం చాలా విడ్డూరంగా కనిపిస్తున్నాడు.

డాక్టరుకు కారియర్ వచ్చించి సిద్ధమై, కారియర్‌తీసి, అన్నం వడ్డించుకోబోతూ ఆగిపోయాడు. అలాగే లేచి వెలుపలికివచ్చి బెంచీమీద కూర్చున్న చెంచయ్యను చూసి బెదురుతూ దగ్గరకు వచ్చాడు.

బెదరటానికి కారణం వుంది. చిన్నతనంలో తనతో స్కూలులో చదువుకొన్న మిత్రుడొకడు రైల్వే పోర్టరుగా వుండి జబ్బుచేసి, సిక్ చేయటంకోసం వచ్చి, మెడికల్ ఎగ్జామినేషన్ పూర్తయిపోతుంటే, పరాచికాలు ఆడి, ఇంటికి తీసుకుపోయి, చిన్నప్పటి ముచ్చట్లు చెప్పుకొని పంపిస్తే ఎవరో గిట్టనివాళ్లు ఫలానా డాక్టరు లంచం తీసుకొన్నాడని ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాయటం ఆపైన ఏమీ జరక్కపోయినా గొడవ జరగటంవల్ల గుండెకాయను గుప్పిట్లో భద్రంగా ఉంచుకొన్నాడు డాక్టరు రఘురాం.

అప్పటిదాకా దగ్గి దగ్గి అలసిపోయి కూర్చున్న చెంచయ్య మాట్లాడితే దగ్గు వస్తుందని భయపడుతూ వున్నాడు. డాక్టరు రఘురాంవచ్చి 'మాష్టారూ!' అన్నాడు.

'ఊ' అంతకంటే మాట్లాడలేదు చెంచయ్య. తలయినా పైకెత్తలేదు.

'ఇంటికి రాకూడదా?'

'నువ్విక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యావని నా కింతకు ముందు తెలియదు'

ఈ మధ్య సంవత్సరంగా ఉత్తరం వ్రాయలేదు రఘురాం.

'భోజనం చేద్దాం రండి!'

చెంచయ్య డాక్టరు ముఖంలోకి చూశాడు. కళ్ళ వెంట నీళ్లు తిరుగుతున్నాయి. 'నేనా?-ఇప్పుడెందుకు—ఆకలి లేదు—వద్దు' వద్దు అన్నమాట చాలా కఠినంగా వినిపించింది.

'లేదు. మీరు రావాలి' ఆజ్ఞాపించినట్టుంది స్వరం. ఆ అధికారం కొడుకు తండ్రిపట్ల చూపుతాడు. భక్తుడు దేవుడిమీద చూపుతాడు.

'రాను' తీక్షణంగా చెప్పాడు. 'అలాకాదు' నెమ్మదిగా అన్నాడు 'ఇంకోసారి' కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

'లేదు' స్థిరంగా వుంది గొంతు. 'మీరిక్కడుండి' గొంతు వణికింది. 'మీరు తినకుండా', స్వరంస్థాయి తప్పింది. 'నేను తినను' నిశ్చయంగా చెప్పాడు.

'అలాగా!' చెంచయ్య పైకి లేచాడు. దగ్గుతెర ముంచుకు వచ్చింది. 'నేనిక్కడుంటే' దగ్గాడు. రెండు అడుగులు ముందుకు వేశాడు. 'నువ్ తినవన్నమాట' ఆగాడు. దగ్గు ఆపుకోలేక పోయాడు. ఎగశ్వాసగా వుంది. ముందుకు సాగాడు. 'అయితే సదాశివం వైపు చూశాడు. 'వెళుతున్నాను' ముందుకు పోతున్నాడు. ఎముకలగూడులాగా వున్నాడు. వెంట సదాశివం నడుస్తున్నాడు. దరఖాస్తు పెట్టుకొన్నవాళ్ళు ఒక్కరొక్కరే వస్తున్నారు. చెంచయ్య వరండా దాటాడు. పోర్టికో దాటాడు. జల్లుపడుతూ వుంది. వర్షంలోకిపోయాడు. డాక్టరు రఘురాం గుండె పట్టుకొని తన గదిలోకి పోయాడు.

డాక్టరు రఘురాం టేబిల్‌ముందు కూర్చున్నాడు. వేసుకున్న విస్తరి వేసినట్లే వుంది. తీసిన కేరియర్ తీసినట్లే వుంది. అన్నం వడ్డించుకో బుద్ధి

పుట్టలేదు. ఆకలి అవుతున్నట్లే లేదు. ఆకలి చచ్చిపోయింది.

తల్లీ తండ్రీలేని తనను మేనమామ ఫస్టుఫారంలోచేర్పించి చెంచయ్యకు అప్పజెప్పాడు. తను వారాలు వుంటూ చమవు కొన్నాడు. వారంలో రెండు రోజులు చెంచయ్య ఇంట్లో తినేవాడు.

గొప్పకోసం కొంతమంది, పాడయిన అన్నం పారేయలేక కొంత మంది బీదవాణ్ణి రక్షించాలి చదివించాలని కొంతమంది వారాలు చెబుతూ వుంటారు. ఎందుకయినా కానీ తనకింత తిండి పెట్టినవాళ్ళను తాను నిందించ లేదు. తన ప్రాణం కాపాడి, తన కాళ్ళమీదతాను నిలబడగలిగేటట్టు అవ కాశం కల్పించిన వాళ్ళందరికీ తాను కృతజ్ఞుడు.

అయితే చెంచయ్య మాత్రం అలాకాదు. తనకు అన్నం వడ్డించిం తర్వాత ఆయన తినేవాడు. తొందరపని ఏమీ లేకపోతే ప్రక్కనే కూర్చొ బెట్టుకుని తినిపించేవాడు. తల్లీ తండ్రి గురువూ దైవం తనేఅయి ఏమీ బాధ కలగకుండా చూశాడు. ఆర్థికంగా హార్దికంగా తనకు అండఅయిన చెంచయ్య మరుపురాడు. తను మరువలేడు.

చిన్నతనంలో ఋజుస్వభావంతో, శ్రమజీవితంతో, ధానధర్మాలతో, దయాదాక్షిణ్యాలతో, పాపం ఎరక్కుండా, పుణ్యంచేస్తూ, స్వార్థం చూసు కోకుండా పరార్థం చూస్తూ, నీతి నిజాయితీలతో ప్రవర్తించే చెంచయ్య చెప్పంది, చూపంది, నేర్పంది, తను విన్నాడు, చూశాడు, నేర్చుకొన్నాడు. తన జీవితంలో, తన రక్తంలో తన వ్యక్తిత్వంలో, తన అస్తిత్వంలో చెంచయ్య స్థిరమైన పునాదులతో ఉన్నాడు.

తను స్కూలుఫైనల్ చదువుతున్నప్పుడు సదాశివం పుట్టాడు. ఆ నెలంతా పండుగలా అయిపోయింది. ఆ సంవత్సరమంతా ఆ పసివాణ్ణి తాను ఎత్తుకొని ముద్దాడనిరోజు లేదు.

కాలేజిలో, మెడికల్ కాలేజిలో, చదువుతున్న రోజుల్లో వారానికి ఒకసారి అయినా వచ్చి చెంచయ్యను పలకరించి పోయేవాడు.

హౌస్ సర్జన్‌గావుంటూ, తన క్లాసుమేటును ప్రేమించి పెళ్ళిచేసు కొన్నప్పుడు తన అదృష్టం చూసి సొంత తండ్రిలాగా చెంచయ్య పొంగి పోయాడు. సిరిసంపదలున్న ఇంటిలో లేకలేక పుట్టిన ఒక్కగా నొక్క కూతురు తన భార్య! నిండుహృదయంతో ఆశీర్వదించిన మేష్టారుకు గురు దక్షిణ ఇమ్మని మామ ఇచ్చిన రెండువేలు ఇవ్వబోతే తీసుకోకుండా చెంచయ్య వెళిపోవటంతో, ఆ డబ్బు సదాశివంపేర బ్యాంకులో వేసి, అ బుక్కు ఇచ్చి వెళిపోయాడు తను.

పదిహేనేళ్ల పూర్వం తనకు రైల్వేలో ఉద్యోగం వచ్చి బైలుదేరు తున్నప్పుడు చెంచయ్య చెప్పిన సత్యాలు జీవితం అంతా కాచి వడపోసిన సత్యాలు: నిగ్గు తేల్చిన సత్యాలు!

అయన చెప్పిన సత్యాలు వేదసూత్రాలుగా, ఆయన జీవితం ఉదాహరణగా తన జీవితం రూపొందించుకొన్న రఘురాం అణువణువునా చెంచయ్య! కణకణానా చెంచయ్య! అర్థం తెలియని పదానికి విద్యార్థి నిఘంటువు వెదుక్కొన్నట్లు తన జీవితంలో ఏసమస్య ఎదురైనా ఏపరిష్కారం అవసరమయినా, చెంచయ్య జీవితమనే నిఘంటువు వెతుక్కొనేవాడు తను. బాల్యం నుంచి తనకెంతో మేలుచేసిన చెంచయ్యకు తానేమి చేయలేకపోయా నని బాధగా వుంటూ వచ్చింది.

ఉద్యోగంలోచేరిన మొదట్లో ఎక్కువగానే చెంచయ్యకు ఉత్తరాలు వ్రాసేవాడు. క్రమక్రమంగా జీవితం బరువు పెరిగి, చెంచయ్య ఒక జ్ఞాపకంగా మిగిలిపోయాడు. డాక్టరు రఘురాం అన్నం వడ్డించుకోలేదు. కళ్ళవెంట నీళ్లు తిరుగుతున్నాయి. 'కలర్ టెస్ట్, రెడీసార్' కాంపౌండరు చెప్పి వెళ్లాడు.

కాజువాలిటీ డాక్టర్ యూకలిప్టస్ చెట్లు మీంచి ఆకాశం లోకి చూస్తూ మధ్య మధ్య లేఖ వ్రాస్తూ కూర్చున్నాడు.

'ఈదేశం ఏమయిపోతుంది?'

'ఈ దేశంలో మనిషికి విలువలేదు. వాడి చొక్కాకు విలువుంది.

వాడి చెప్పుకు విలువుంది. మనిషికి లేదు. మనిషికి విలువలేదు. మనిషి కులానికి విలువుంది. మనిషి మతానికి వుంది. భాష, డబ్బు, చదువు, రాష్ట్రం, దేశం అన్నింటికి విలువుంది. మనిషికి లేదు. ఈ దేశంలో దమ్మిడీకి కొర గాడు'

'మనకు మనజాతికి జాతీయత లేదు. ఒకణ్ణి ఇంకొక డెప్పుడూ సోదరుడు అనుకోలేడు. అనుకోనీడు. అవకాశం లేదు అది కలగదు. కలగ నివ్వదు.'

'మన బ్రతుకుల్లో ఎంత నైచ్యం? ఎవడి స్వార్థం వాడిది. ఎవడి లాభం వాడిది. ఎవడిమేలు వాడిది. తన సుఖం, తన లాభం తన మేలు, తన ఆనందం తప్ప ఎవడూ ఎవడికోసమూ చూడడు'

'మనకు మరొకడితో సంబంధంలేదు. స్నేహంలేదు. కలయిక లేదు. పొత్తులేదు. ఉన్నట్లు నటన. అభాస. మోసం.'

'ఈ వ్యవస్థలో అందరూ అందరికీ ఏదోవిధంగా విరోధులు. ప్రతి వ్యక్తి మరో వ్యక్తి కంటే గొప్పవాడు. ప్రతివ్యక్తి ఒక స్వయం శక్తి! ప్రతిమనిషి ఒక స్వయం వ్యవస్థ! ఈదేశంలో సామూహిక చైతన్యం లేదు. సామూహిక సామర్థ్యం లేదు.'

'నలుగురిలో ఒకడుగా ఈ దేశంలో ఏ ఒక్కడూ ఉండడు! తన మాట నలుగురూ వినాలికాని తనుమాత్రం ఎవరిమాటా వినడు. తను అందరి కంటే శ్రేష్ఠుడుకాని, తనకంటే అధికుడు లేడు.'

'తనకు, తనవారికి, తనచుట్టూ తప్ప, ఈ జాతికి లోకం లేదు. తనది కానిది ఏమీ ఉండకూడదు. నలుగురి మేలుకోరే వాళ్ళు లేరు. నలుగురి కోసం తన మేలు వదులుకొనేవాళ్లు లేరు. పదిమందికోసం నష్టపడేవాడు అసలేలేడు. సామూహిక లాభం కోసం తనని తాను అర్పించుకో గలిగే వాడు ఈ దేశంలో మచ్చుకైనా దొరకడు.'

ఈ మనుష్యులతో, ఈ దేశంలో ఏం అభివృద్ధి? ఏం అభ్యుదయం?

ఏం పురోగమనం? ఈ జాతి మేల్కోదు. ఈదేశం బాగుపడదు!'

కాజువాలటీ డాక్టరు ఉత్తరం ముగించకుండా ఎక్కడా చూడకుండా కళ్లు మూసుకొని కూర్చున్నాడు.

కలర్ టెస్ట్ జరుగుతూ వుంది. స్విచ్‌బోర్డు డాక్టరు చేతిలో వుంది. గది కిటికీలు తలుపులు మూసివున్నాయి. కిటికీ కన్నాలలోంచి పడిన నీళ్లు సన్నని కాల్వగా కాళ్లక్రిందగా పోతున్నాయి. డాక్టరు స్విచ్ ఆన్‌చేశాడు. గోడ మీద బోర్డులో బల్బ వెలిగింది.

'ఏం రంగు?'

'పచ్చ!' సదాశివం చెబుతున్నాడు.

'ఏం పచ్చ?'

'ఆకుపచ్చ!'

'ఆ స్విచ్ ఆఫ్ చేశాడు. రంగులేదు. మరోస్విచ్ ఆన్ చేశాడు.

'సరిగ్గా చూడు! ఇదేం రంగు?'

'ఎరుపు?'

'చూసి చెప్పు'

'ఎరుపు!'

'సరిగ్గా చూడు!'

'ఎరుపు!'

రంగు మారింది.

30)

'ఇదేం రంగు'?

'తెలుపు'

'ఇదీ?'

'నీకు రంగులు కనిపిస్తున్నాయా?'

'వెలుతురు కనబడుతూవుంది'

'సదాశివం' డాక్టరు గొంతు లోయలో పడుకున్నవాడి కేకలాగా, పసివాడి ఆకలి అరుపులాగా, కొండరాయి దొర్లినట్లు, లారీ గోడకు డీకొన్నట్లు వింతగా వినబడింది.

'నీకు రంగులు తెలుస్తున్నాయా?'

'ఆఁ!'

డాక్టరు పెద్దగా నవ్వాడు. వికృతంగా నవ్వాడు. సుందరంగా నవ్వాడు. గ్రీన్‌బల్బ్ వెలిగింది. రెడ్‌బల్బ్ వెలిగింది. గ్రీన్‌సిగ్నల్‌లా కనిపించింది. రెడ్‌సిగ్నల్‌లా కనిపించింది.

ఇంజను వస్తూవుంది. ఎదురుగా సిగ్నల్. లోకంనిండా చీకటి! ఇంజన్ వెనుక కంపార్టుమెంటులు. జనం ఆదమరచి నిద్రపోతున్నారు. రైల్లో జనం. పిల్లలు స్త్రీలు పురుషులు ఏమీ చూడకుండా ఏమీ గమనించకుండా నిద్రపోతున్నారు. అర్థరాత్రి! ఎదురుగా సిగ్నల్.

రైలు వస్తూవుంది. ఇంజన్‌లో డ్రైవర్; ఎదురుగా సిగ్నల్‌లైటు; గ్రీన్! రైలు పోతూవుంది. రెడ్! ఎదురుగా సిగ్నల్. ఎదురుగా లైటు; గ్రీన్! రెడ్! సిగ్నల్ వంగింది. సిగ్నల్ వంగలేదు. లైటు తెల్లగా! డ్రైవరు చూస్తున్నాడు. లైటు ఎర్రగా; రైలు పోతూవుంది. లైటు ఆకుపచ్చగా! జనం నిద్రపోతున్నారు.

డ్రైవర్ చూస్తున్నాడు. ఎదురుగా సిగ్నల్ లైటు. ఇంజన్ కూత వేసింది. ఫైర్‌మన్ బొగ్గు వేస్తున్నాడు. రైలు పోతూవుంది. సిగ్నల్ వంగింది. రైలు ఆగలేదు. ఇంజన్ పోతూవుంది. రైలు పోతూవుంది. డ్రైవరు నడుపుతూవున్నాడు.

స్టేషన్ వచ్చింది. రైలు ఆగాలి. బ్రేక్ వేయాలి. అంతలో....భూమి పగిలింది. కొండ బ్రద్దలయింది. ఆకాశం చిరిగింది; వస్తున్న ఎక్స్‌ప్రెస్. స్టేషన్‌లో ఆగివున్న పాసింజరును గుద్దింది. డ్రైవర్లు చచ్చిపోయారు. ఫైర్‌మన్‌లు చచ్చిపోయారు. పాసింజర్ల అరుపులు కేకలు ఏడుపులు మూలుగులు. స్త్రీలు పిల్లలు వృద్ధులు; ఏడుపు–విపరీతంగా ఏడుపు! గోల గోల! ఎక్స్‌ప్రెస్ ఇంజన్ డ్రైవరు సదాశివం చచ్చిపడివున్నాడు.

'తమ్ముడూ!' డాక్టరు రఘురాం అరిచాడు.

'ఏంసార్!' సదాశివం పలికాడు.

చేతిలో ఉన్న స్విచ్ బోర్డులోని స్విచ్‌లు అన్నీ వత్తాడు. ఎన్నో బల్బులు. ఎన్నో రంగులు. వింత వింత రంగులు. చాలారంగులు. డాక్టరు ముఖంలో రంగులు మారిపోతున్నాయి. వింతగా విచిత్రంగా ముఖం కనబడుతూవుంది. వెర్రిగా పిచ్చిగా చూస్తున్నాడు. గట్టిగా శ్వాశ పీల్చుకొన్నాడు. ఊపిరి బరువుగా ఆడుతూవుంది.

పూరింటిలో పంచలో కుక్కిమంచంలో డెబ్బైఏళ్ళ ముసలాయన మాటలు పడిపోయి, నోరు కదుపుతూ ఉన్నాడు. ఆ గొంతులో పోయటానికి గంజి అయినా లేదు.

నలుగురు పిల్లలతండ్రి పాతికేళ్ళవాడు ఏభైఏళ్ళ వాడులాగ అయిపోయాడు. అతని భార్య నడుస్తున్న శవంలాగా వుంది.

ముసలాయన ఆకలితో చచ్చిపోయాడు. పిల్లలతండ్రి గ్రుడ్డివాడయి; భార్యనూ పిల్లల్నీ పోషించలేక దేశాలవెంట వెళ్ళిపోయాడు. భార్య శీలం కోల్పోయి గతించింది.

పిల్లలు అన్నంలేక అడుక్కుతింటున్నారు. కట్టబట్టలేదు. ఉంటానికి చోటులేదు. రైల్వేస్టేషన్‌లో బస్‌స్టాండులో ఎవరో తిడుతున్నారు తంతున్నారు పెడుతున్నారు. వీళ్లు బ్రతుకుతున్నారు.

నీచంగా దీనంగా మానవుడి సంతతి భవిష్యత్ సమాజం దిక్కులేక అడుక్కుతింటూ వుంది. అవస్థపడుతూవుంది

ఎవడో పసివాణ్ణి బలంగా కడుపులో తన్నాడు. ఆకలయిన కడుపు. అన్నంలేని కడుపు. పేగుల్లో ఏమీలేని కడుపు. పేగులులేని కడుపు. వెన్నెముకకు అంటుకుపోయిన కడుపు. తన్ను భరించలేక నేలమీదపడి విలవిలా గిల గిలా తన్నుకులాడుతూ వుంది.

'అమ్మా! అమ్మా!! అమ్మా!!!'

అరుస్తూవుంది.

అరుస్తున్నాడు.

అరిచాడు డాక్టరు రఘురాం.

'ఏందేంది సార్?' సదాశివం అదిరిపోయాడు.

'ఏమయింది సార్?'

కాంపౌండరు తలుపు తీసుకొని లోపలికి వచ్చాడు.

సదాశివం వెళ్ళిపోయాడు. ఇంకోతను వచ్చాడు.

రైల్వే హాస్పిటల్‌లోకి అప్పుడే రిక్షాలోవచ్చిన మనిషి ప్రక్కవాలుగా పడ్డ నీటిబొట్టు తుడుచుకొంటూ వరండా చివర నిలబడివున్నాడు. వరండా నిండా కాళ్ళ తడి! మరకలు! చలిగాలి బుసలు కొడుతూవుంది. వయ్యారాలు పోతూవుంది. వళ్ళు కొరుక్కు తింటూవుంది.

జరుగుతున్న సి-టెస్ట్‌తో మెడికల్ ఎగ్జామినేషన్ పూర్తి అవుతుంది.

చెంచయ్య లోపలున్న కొడుకుకోసం చూస్తున్నాడు. కాని గుంటల్లో చిక్కబడిపోయిన కళ్లు రెండూ విడిపించుకొని చూస్తున్నాడు.

సదాశివం చూపు సరిగా లేదు. వీడు సెలెక్ట్ కాడు. వీడికి ఉద్యోగం రాతలేదు. ఇంతకుముందు ప్రయత్నాలు నెరవేరలేదు. ఇదీ అంతే!

తన జీవితంలో ఎవరినీ ఏమి అడగలేదు. సర్వీసులో లోపంలేదు. తనవిధి తాను ఎప్పుడూ నెరవేర్చాడు. ఎప్పుడు ఎవరికీ ఏవిధంగానూ బరువు కాలేదు. తనపట్ల దేవుడుమాత్రం నిర్దయుడుగా ఉన్నాడు.

తనకు ఒక్కడే కొడుకు. వాడి బాగోగులు తన కక్కరలేదా? వాడు బికారి అయిపోతే చూస్తూ వూరుకోవాలా? వృద్ధాప్యంలో దిక్కులేని చావు చావాలా? ఎవరికోసం ఈ నీతినియమాల రొంపి? ఎవరికోసం ఈ సత్య ధర్మాల పీడ? ఎవరికోసం ఈ ముక్కుకు సూటిగా పోయే ముదనష్టపు తత్త్వం?

ఈ ఆలోచనవల్ల వచ్చే మార్పు-అవును-తను అంగీకరిస్తాడు. డెబ్భై ఏళ్ళ అమృతం వంటి జీవితంలో విషబిందువు చిలుక్కోక తప్పటంలేదు. తెల్లటి పట్టుబట్టవంటి జీవితంమీద బురద జలుక్కోక తప్పటంలేదు. ఇంత కాలం తిన్నగా స్వర్గంచూస్తూ పెరిగిన వ్యక్తిత్వపు వృక్షం కూకటివ్రేళ్ళతో కూలి నరకంలో పడేటట్లుగా నరుక్కోక తప్పటంలేదు. ఎందరి హృదయాల లోనో ఉత్తముడుగా చిత్రితమయి ఉన్న బొమ్మ చెరుపుకోక తప్పటంలేదు.

ఎప్పుడో సదాశివం పేరిట రఘురాం బ్యాంకులో వేసిన డబ్బు తప్పని సరిఅయి, వడ్డీతో సహా పూర్తిగా తీసుకొని మూటకట్టి భద్రంగా తెచ్చాడు.

ఈ డబ్బు అంటుకోవటంతోనే తన పతనం ప్రారంభమయింది. ఆ డబ్బు మోస్తున్న కొద్దీ ఆ బరువుకు క్రమక్రమంగా క్రుంగిపోవటం తప్పటం లేదు. ఆ డబ్బు లంచంగా మెడికల్ ఎగ్జామినర్‌కు ఇచ్చి, కంటిచూపు సరిగా లేని తన కొడుకును సెలెక్ట్ చేయమని అడగటానికి మనసులో అనుకొన్న రోజు, అనుకోవటం సంకల్పం అయినరోజు, అందుకోసం బయలుదేరి

వచ్చినప్పుడు, ఇక ఇవ్వబోతున్నాననుకొన్నప్పుడు, పూర్తిగా పాతాళంలో పడి, ఆ పొరల్లో కూరుకుపోయి, తొలుచుకుపోయి సజీవంగా నాశనమయిన తనమీద తనకే అసహ్యం కలుగుతూవుంది.

కాని, ఇవాళ తనకేం బాధ కలగటం లేదు. ఎగ్జామినర్ రఘురాం కాకపోతే, తను పాతాళంలోనే గతించేవాడు. అయితే ఇప్పుడు పైకి లేస్తున్నాడు.

రఘురాం చిన్ననాటి చిన్నవాడిలా ప్రవర్తించి తనను ఒకనాటి పెద్దవాణ్ణి చేశాడు. రఘు తనని పెద్దవాణ్ణి చేయకపోతే, గుర్తుచేయకపోతే, అలా ప్రవర్తించి ఉండకపోతే తను చిన్నవాడుగా ఉండిపోక తప్పేదికాదు.

రఘురాం డాక్టరుగా ప్రవర్తించివుంటే, వృద్ధుడైన తండ్రిగా తనగోడు తను వెల్లడించుకొని వుండేవాడు. బాల్యం గుర్తుకు తెచ్చుకొని, నీ తమ్ముని కోసం, నీ గురువుకొసం ఈ డబ్బు, నీ డబ్బు తీసుకొని అయినా వీణ్ణి ఒక ఉద్యోగిని చేయమని అర్థించివుండేవాడు.

కాని, తను పాతాళంలోంచి పైకి లేస్తున్నాడు. లంచం ఇవ్వబోవటం లేదు. నా ముఖం చూసి అయినా వాణ్ణి సెలెక్ట్ చేయమని అడగటంలేదు. తను పాతాళంలోంచి పైకి లేస్తున్నాడు. చిన్నతనంలో తనుచేసిన మేలుకు ప్రతిఫలం అడగడంలేదు. తను పాతాళంలోంచి పైకి లేస్తున్నాడు. చిన్ననాడు చేసిన మేలుకు కృతజ్ఞత అయినా స్వీకరించటంలేదు. ఎప్పటిలాగే ఇప్పుడూ ఎవరినీ ఏమీ యాచించడంలేదు. తను పతనమయిపోలేదు. పాతాళంలో పడలేదు. కన్నీటితో తనను తాను ఓదార్చుకొంటున్నాడు చెంచయ్య.

తను కొద్దిలో కొద్ది రఘు వ్యక్తిత్వపు ఆధిక్యానికి కారణం అయివుండవచ్చు. తన కంటి ఎదుట బాలుడు, తన కంటి ఎదుట యువకుడు, తన కంటి ఎదుట డాక్టరు, తన నీడలోనీడ, తన ఇంట్లో బిడ్డ, తన వ్యక్తిత్వంలో పుట్టిన మొలక, తాను పాడైపోతుంటే, తాను పతనమయిపోతుంటే, తాను నాశనమయి పోతుంటే బాగుచేశాడు, ఉద్ధరించాడు, కాపాడాడు. 'నీ నీడ నన్ను కాపాడింది. నన్ను నేను కాపాడుకొన్నాను' అనుకొన్నాడు చెంచయ్య.

చెప్పరాని ఆనందంతో తలమునకలవుతున్నాడు చెంచయ్య. తాను ఆదరణ చూపుతూ పొంగిపోలేదు. తనకు అన్నీ వున్నప్పుడు అతిశయ పడ లేదు. నిరవసరంగా ఉన్నప్పుడు విర్రవీగలేదు. అలాగే అవసరమయినా నిశ్చలంగా, ఆశిస్తూ, ప్రశాంతంగా, అత్యవసర జీవిత విషవలయంలో చిక్కుకొన్నప్పుడు నెమ్మదిగా ఉండే అవకాశం కల్పించిన తన విద్యార్థికి మనస్సులో కృతజ్ఞత చెప్పుకొన్నాడు చెంచయ్య.

సీ-టెస్ట్ పూర్తయి సదాశివం వెలుపలికి వచ్చాడు. ముఖం దీనంగా వుంది. మ్లానంగా వుంది. పిచ్చిగా వుంది. అయోమయంగా వుంది. 'బాగా కనిపించలా' చెప్పాడు. తండ్రి ముఖంమీద ఉదయంనుంచి క్రమ్ముకొన్న నల్లమేఘాలు తొలగి మెరుపు మెరసినట్లు నవ్వు తొణికింది. సదాశివం అర్థం కాక పిచ్చిగా చూశాడు.

'నేను సెలెక్ట్ అవుతానో లేదో!'

'సెలెక్ట్ అయితే డ్రైవరుఅవుతావు, లేకపోతే లేదు.'

'డాక్టరుగారు ఏంచేస్తారో ఏందో!'

'నాకు సంతోషకరమయిన న్యాయంచేసి మనకు కష్టం కలిగిస్తాడో, నాకు బాధాకరమయిన అన్యాయంచేసి మనకు సంతోషం కలిగిస్తాడో చెప్ప టం కష్టం. ఏంచేసినా.........' వాక్యం పూర్తికాలేదు.

సీ-టెస్ట్ ముగించి వెలుపలికి వచ్చిన డాక్టరు రఘురాం క్రొత్తమనిషిగా కనిపించాడు.

తన గదిలోకి పోయి, తలుపులు వేసుకొని, ఎనిమిది పేర్లున్న లిస్టు తెరచి టేబిల్‌మీదపెట్టి, ఒక్కొక్క పేరు తిన్నగా ఉన్న ఒక్కొక్క టెస్ట్ రిజల్ట్ చూసుకొంటూ ఫైనలైజ్ చేయబోతున్నాడు.

కిటికీలు తీసి వున్నాయి. ఈదురుగాలి జుమ్మని తోలుతూవుంది. నరాలు కొరికే చలి! బైట వాన! హోరు! డాక్టరు రఘురాం వంటినిండా

చెమటపట్టింది.

రెండు ఫేన్‌లువేశాడు. గాలి విదిలించి కొడుతూవుంది. పైనుంచి కిటికీలలోంచి చల్లని చలిగాలి. అయినా చెమట ఆరిపోలేదు. ముక్కుకొసలో బొణతల్లో నుదిటిమీద ఆగకుండా చెమట!

సదాశివం పేరు తిన్నగా పెన్నువచ్చింది. ఆగింది. కదలలేదు. అయిదు నిమిషాలు—కదల్లేదు. పది. కదల్లేదు. అది కదల్లేదు. నృత్యం చేసి చేసి అలసిపోయిన నర్తకిలాగా ఆగిపోయింది కలం.

బాల్యం-చదువు చెంచయ్య—మనస్సులో మెదులుతుంటే కాలంకదల్లేదు కలంకదల్లేదు. తనకెంతో సహాయంచేసిన వ్యక్తికి తానేం చేశాడు? బుర్ర బద్దలుకొట్టుకొన్నాడు. ఏమీ చేయలేదు.

తను కృతఘ్నుడా?

సదాశివం గుర్తుకువచ్చాడు. అతని కళ్లు. రంగు నంబరులు, రంగు లైట్సు. కళ్ళముందు వింత వింతగా తిరుగుతున్నాయి. ఏం చేయాలి?

తను ధర్మద్రోహి?

కలం కాగితంమీద నడవబోయింది. మళ్లీ ఆగిపోయింది. చెమటలు కక్కే నర్తకిలాగా కూలబడిపోయింది.

ఆప్యాయంగా అన్నంపెట్టిన చెంచయ్య, ఆదరంగా ఫీజుకట్టిన చెంచయ్య, అనురాగంతో నీతినియమాలు నేర్పిన చెంచయ్య ఎదుట నిలబడ్డాడు. గుండె వేదికమీద నిలబడ్డాడు. శిరశ్శిఖరం మీద అధిష్ఠించాడు. నాకు గౌరవం వద్దు—వాడికి ఉద్యోగం! నాకు కోటువద్దు-వాడికి ఉద్యోగం! నాకు అన్నం వద్దు-వాడికి ఉద్యోగం! ముప్పేటన కేకలు పెడుతున్నట్లుంది.

ఏం చేయాలి?

ఈ దేశం. ఈ జనం వీళ్ళు! ధర్మం తావు తప్పటం. అన్యాయం

తలఎత్తటం. నీతి లేకపోవటం. నిజాయితీ నాశనం కావటం, ఇదా నువ్ చేయబోయేది.

ఏం చేయాలి?

రఘురాం కలం తీసుకొన్నాడు. వ్రాయబోయాడు. ఆగిపోయాడు. కలం ఎగశ్వాస పుట్టిన నర్తకిలాగా పడుకొని దొర్లుతూవుంది.

రైలు వెళుతూ వుంది. సిగ్నల్ ఇవ్వలేదు. డ్రైవరుకు కనబళ్లేదు. రైలు పోయింది. పాసింజరును గుద్దింది జనం చిన్న పెద్ద చనిపోయారు.

ఏం చేయాలి?

తిండిలేక ముసలాయన చచ్చి, తండ్రి గుడ్డివాడై, తల్లి పరాభవింపబడి, పిల్లలు దిక్కులేని వాళ్ళయి, దెబ్బలు తింటూ తిండిలేక, దొంగలై, హంతకులై-రామరామ!

ఏం చేయాలి?

పెన్ను తీసుకొన్నాడు. వ్రాయబోయాడు. పెన్ను పోట్లగిత్తలాగా ఎదురు తిరిగింది. మొరాయించింది. మొండి కేసింది. పొడవబోతూవుంది.

లైట్లు వెలుగుతున్నాయి. ఫేన్లు తిరుగుతున్నాయి. చలిగాలి బైటా లోపలా బాహిరంగా ఆంతరంగా పెన్ను పొడవబోతూ వుంది.

ఏం చేయాలి?

తనకు సర్వం తానే అయిన చెంచయ్య వెర్రిగా అరుస్తున్నాడు. పిచ్చిగా చూస్తున్నాడు. ఎప్పుడూ చేయనిపని చెంచయ్య కోసం చేయాలా? రైలింజనులు పగిలి బద్దలయ్యాయి. ముసలాయన చనిపోయాడు. సదాశివం గుడ్డివాడయ్యాడు. రంగు బల్బులు పగిలిపోతున్నాయి. ఫేనులు తిరుగుతున్నాయి. పిల్లలు అడుక్కు తింటున్నారు. పిల్లవాణ్ణి పోలీసు కాలితో

తంతున్నాడు. తిండిలేదు. బట్టలులేవు. రైలుపడిపోయింది. చనిపోతున్నారు జనం. చనిపోయారు పిల్లలు స్త్రీలు, వృద్ధులు. ఇనుపకడ్డీ గుచ్చుకొని, కను గ్రుడ్లు వెలుపలికి వచ్చి, రైలింజను పొయ్యి ప్రక్కనే చనిపోయిన సదాశివం. పెన్ను నర్తకిదొర్లి దొర్లి శవంలాగా పడివుంది. ఫేన్‌గాలిమోత శ్మశానంగాలి హోరు! లిష్టు గాలికి కొట్టుకొంటూవుంది. తిండివద్దు! ఏమీ వద్దు! ఉద్యోగం! ఉద్యోగం!! ధర్మం నెత్తిన దుమ్ము! నీతి కంట్లోకారం! అమ్మా ఆకలి, అన్నం పెట్టిన చేయి, ఆదరణ చూపిన హస్తం. యాచించని చేయి. యాచించే చేయి. అడక్కుండా అడిగే హస్తం.

వర్షం హోరు. ఫేనుగాలి—పెనుగాలి, చల్లని చలిగాలి మంట, ఆకాశంలో అగ్ని పర్వతాలు. చెంచయ్యలో పొంగే లావా! చలి పుడుతూ వుంది. చిన్న తమ్ముడు! ఒకే ఒక్కడు! లిష్టు టేబిల్‌కేసి గుండె బాదు కొంటూవుంది. ముఖంమీది చెమటబొట్టు, లిష్టుమీద గంధపుపూత. హిమా లయం ఎత్తు! ఆశలు ఎత్తు! శిఖరాలమీద ఆశలు! పెన్ను తీసుకొన్నాడు. పెన్నుకు ప్రాణం వచ్చింది. ఒళ్ళు విరుచుకొని ఆవులించింది. వెలుపల నిశ్శబ్దం! లోపల నిశ్శబ్దం! ఫేనులు నిశ్శబ్దం. చలిగాలి నిశ్శబ్దం! ఘోష-హోరు. గర్జన. భయంకరధ్వని, మేఘాలు పగిలిన ధ్వని, గుండెధ్వని. గుండెపగులుతున్న ధ్వని. లబ్ లబ్ లబలబా-దబదబా-వర్షంహోరు కిటికీ మోత. పెన్ను కాగితం మీదికి. పోయింది. ఇంజను పగిలిపోయింది ధర్మం హాయిగా నవ్వింది. చెంచయ్య అరుపులు వినబడుతున్నాయి. అవ్యక్త మధురంగా పల్లకీల మోత! పెన్ను నృత్యం చేస్తూవుంది. సదాశివం పేరు తిన్నగా పెన్ను! భూమి తల కిందులవుతూ వుంది. ఆకాశం చాపచుట్టగా నేలమీద పడిపోయింది. వ్రాత పూర్తయింది. డాక్టర్ ముఖంనిండా చెమట! వళ్ళంతా చెమట! చేతినిండా చెమట! ఏరుగా జవజవగా - వణుకుతున్నాడు డాక్టరు రఘురాం.

అన్ని పేర్లు తిన్నగా వ్రాత పూర్తి అయింది. తక్షణం కవరు తీసు కొన్నాడు. వెంటనే లిష్టు కవరులో పెట్టాడు మరుక్షణం అంటించాడు. సీలు వేశాడు కాంపౌండరును పిలిచాడు కవరు ఇచ్చాడు. పంపించాడు. మరు నిమిషంలో కవరు సూపరింటెండెంటును చేరింది.

గట్టిగా ఊపిరిపీల్చి వదిలాడు డాక్టరు. చెమట తుడుచుకొన్నాడు. టవలు వానలో తడిసినట్లు అయింది. గుండెదడ హెచ్చింది. గుండెధ్వని శవవాహకుల పాదధ్వనిలాగా వుంది. గుండె దప్పుల్లోని విలయం వినలేక పోతున్నాడు.

సదాశివం సెలెక్ట్ అయ్యాడా? డాక్టరు చేశాడా?

సూర్యుడు చూడలేని తావులు కవి చూస్తాడు. కవి చూడలేని చోటు డాక్టర్ రఘురాం ఆధీనంలో వున్న ఎక్స్‌రే చూస్తుంది. ఎక్స్‌రే కూడా చూడలేని పొరలు గుండెల్లో ఉన్నాయి. ఏ గుండెలో పొరలు ఆ గుండెవున్న మనిషికి తెలియవచ్చు. అయితే, రఘురాం గుండెలో ఉన్న పొరలు అరలు మరలు అతనికే తెలియవు. ఇక ఇప్పుడైనా అతనేం వ్రాశాడో-అతనికూడా- కవరు చించి చూస్తేతప్ప తెలియదు.

రఘురాం శ్వాస బిగబట్టాడు. చెమట తుడుచుకొంటూ ఉన్నాడు. ఆయాసంగా వుంది. కురుక్షేత్రంలో కౌరవుల పద్మవ్యూహం నుంచి తప్పించుకొని వచ్చిన అభిమన్యుడిలా రొప్పుతున్నాడు.

చెంచయ్య, దగ్గుతూ, తూలుతూ, ఆయసంగా, ముఖమంతా నల్లగా, బాధగా డాక్టరు రఘురాం గదిలోకి వచ్చాడు.

డాక్టర్ వెర్రిగా చూశాడు.

వస్తూనే జేబులోంచి డబ్బు కట్టతీసి బల్లమీద వుంచాడు.

డబ్బు కట్ట చూస్తూనే పిచ్చివాడిలా అయిపోయి 'ఏమిటిది?' ప్రశ్నించాడు డాక్టరు.

'డబ్బు!'

'అదే: ఎందుకుని!'

'నువ్విచ్చింది. వడ్డీతోనహా....' దగ్గు తెరవచ్చింది. ఖంగు ఖంగున దగ్గాడు. పొర పోయింది. గొంతుకు పూడుకుపోతూ వుంది.

రఘురాం డబ్బు తాకలేదు. చెంచయ్య ముఖంలోకి భయంగా చూశాడు. పిచ్చిగా చూశాడు. ఆలోచనగా చూశాడు. ఇంతకాలం తిరిగి ఇవ్వనిడబ్బు—ఇంతకాలం తమ సొంతం అనుకొన్న డబ్బు—ఇక్కడ తానున్నట్లు తెలియక

పోయినా, తనకు, తనది, తిరిగి ఇవ్వాలని-కాదు, తెచ్చిన, ఎందుకోవడ్డీతో సహా తెచ్చిన డబ్బు-చూస్తూ చెంచయ్య ముఖంలోకి తెల్లగా, నల్లగా, తారుగా, కాటుకగా, చీకటిగా, తారుకాటుకచీకటిగా చూశాడు డాక్టరురఘురాం.

చెంచయ్య ఆ చూపు భరించలేకపోయాడు. రఘురాం ముఖంలోకి చూడలేకపోయాడు 'కాదుకాదు' తలతిప్పుకొన్నాడు. 'కాదుకాదు' తల తిరుగుతూ వుంది. 'కాదుకాదు' స్పృహతప్పుతూ వుంది. 'కాదుకాదు' నేలమీద పడ్డాడు. 'కాదుకాదు' గొణిగాడు. విపరీతంగా దగ్గాడు. భారంగా దగ్గు ఆగిపోయింది.

చేయిపట్టుకు చూశాడు డాక్టరు రఘురాం. ముక్కు దగ్గర చేయి పెట్టి చూశాడు డాక్టరు రఘురాం.

గుండెల్లో అలలు అలలుగా దుఃఖం పొంగుతూ వుంది. కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి.

'నన్ను క్షమించండి! క్షమించండి!!'

నేనిచ్చిన డబ్బు మళ్ళీ నేను తీసుకోలేననో ఏమో!

'నన్ను క్షమించండి! క్షమించండి!!'

మీకు ఇష్టమవుతుందని, మీకు సుఖం కలుగుతుందని మీరు హాయిగా వుంటారని, మీరు చూపిన ధర్మపథం తప్పినందుకంటున్నాడో ఏమో!

'నన్ను క్షమించండి! క్షమించండి!!'

మీరు చూపిన నీతిమార్గం తప్పలేక, మీకు కష్టం కలుగుతుందని తెలిసినా, మీరు బాధలు పడుతారని తెలిసినా, మిమ్మల్ని హింసించటమవుతుందని తెలిసినా, ఏమీ చేయలేక పోయానంటున్నాడో ఏమో!

'నన్ను క్షమించండి! క్షమించండి!!'

పసిపిల్లవాడు తల్లిని చుట్టుకొని ఏడ్చినట్లు ఏడుస్తున్నాడు డాక్టరు రఘురాం. అతని ఏడ్పు వినకుండా, క్షమించానని చెప్పకుండా, శరీరం వదిలేసి, దూరంగా, దూరదూరంగా, అనంత దూరంగా గర్వంగా వెళిపోతున్నాడు చెంచయ్య.

*

ఆంధ్రపత్రిక—విరోధికృత సంవత్సరాది సంచిక (1971—72)